**అనుకున్నది అనుకున్నట్లు జరగకపోవచ్చు కానీ, ఆ అనుకోవడంలో పదిమందికి పనికొచ్చే మంచి వుందని తెలిస్తే ఎవరు మాత్రం గుర్తించరు?**

సారథి అతన్తోపాటు మరో నలుగురూ పట్నంనుంచి వచ్చే బస్సుకోసం ఎదురుచూస్తూ నుంచున్నారు.

ఎండ చురుగ్గా వుంది, గాలి వెచ్చగా వుంది.

రెండు గంటలు పైగా గడిచినా బస్సు రాలేదు.

ఎండ తీవ్రత తగ్గి క్రమక్రమంగా చల్లబడసాగింది వాతావరణం.

"ఇంక ఈ పూటకి రాదేమో. వెళ్ళిపోదాం పదండ్రా" అన్నాడు సోమయ్య.

"అవున్రా! వెళ్ళిపోదాం నుంచున్నుంచుని కాళ్ళు నొప్పిగా వున్నాయి. ఒకవేళ వస్తే అదే వస్తుందిలే" విసుగ్గా అన్నాడు చింతాలయ్య.

"తప్పురా. అలా వెళ్ళకూడదు. మనం బస్సు దగ్గర వుంటామని ఆ అమ్మాయికి మాటిచ్చాం. తీరా మనం వెళ్ళిపోయిన తర్వాత ఆ అమ్మాయి వొస్తే చాలా ఇబ్బంది పడుతుంది. చీకటిపడే వరకూ చూద్దాం. రాకపోతే అప్పుడే ఆలోచిద్దాం" అన్నాడు సారథి

సారథి మాటకు ఎవరూ ఎదురు సమాధానం చెప్పకుండా మళ్ళా రాబోయే బస్సుకోసం ఎదురు చూడసాగారు

అందమైన ఆడపిల్ల ఏం చేసినా అందంగా వుంటే వుండొచ్చు! అలాగే. మనసున్న మగవాడు ఏంచేసినా అందంగానే వుంటుంది!

సారథి వయస్సు ఇరవై సంవత్సరాలు. వయస్సులో వున్నాడు గనుక అందంగా వుండాలన్న రూలేం లేదు. అతను సెకెండ్ క్లాస్ పాసై ఆ తర్వాత చదివేస్థోమత లేక. గూడెంలోనే వుంటూ. వున్న ఎకరం పొలం చూసుకుంటూ అందరికీ సహాయపడుతున్నాడు.

సారథి ఆ గూడెంలోవున్న యువకుల్ని చేరదీసి దసరా వుత్సవాలకు సాంఘిక నాటకం ఒకటి ప్రదర్శించడానికి పూనుకున్నాడు.

దాని ఫలితమే బస్సుకోసం ఈ నిరీక్షణ

ఆ నాటకంలో హీరోయిన్ వేషంవేసే 'కాంతిశ్రీ' పట్నంనుంచి రావాలి.

ఈ రాత్రికి నాటకం రిహార్సల్సువేసి ప్రొద్దుటే మళ్ళా ఆ అమ్మాయిని పంపించెయ్యాలి. మరో వారం రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

అప్పటికి పూర్తిగా చీకటిపడలేదుగానీ పశ్చిమ దిశలో వున్న సూర్యుడు అలసటగా వున్నాడు. ఏ క్షణంలోనైనా విశ్రాంతి తీసుకోవడానికి మబ్బుల చాటుకి వెళ్ళిపోవచ్చును

ఎదురు చూస్తున్న బస్సు రానే వచ్చింది. రావాలనుకున్న కాంతిశ్రీ ఆ బస్సులో రానే వచ్చింది.

బస్సు దిగడంతోనే సారథిని చూసి—

"సారీ అండి. బస్సు లేటయింది. అనుకున్న టైమ్‌కి రాలేకపోయేసరికి మీరు వెళ్ళిపోతారేమోనని చాలా కంగారు పడ్డాను. మిమ్మల్ని చూడ్డంతోనే మహానందపడిపోయాను" అంది.

సారథి నవ్వి—

"బస్సు లేటయిందానికి మనమేంచేస్తాం రండి. మా గూడెం వెళ్ళాలంటే రెండు మైళ్ళు మీరు నడవక తప్పదు." అని అన్నాడు

కాంతిశ్రీ చేతిలోని బ్యాగను తనతో వచ్చిన 'ఆయా'కిచ్చి—

"అదేవిటి బండికూడా వెళ్ళదా!" అనడిగింది

"వెళ్ళదండి దారంతా ఇసుక డొంక. దానికితోడు ఒక వంతెన దాటాలి. వంతెన మీదనుంచి బండి వెళ్ళదు. మనుషులు నడిచి వెళ్ళడానికి మాత్రమే అది పనికి వస్తుంది. వంతెన క్రిందనుంచి బళ్ళు వెళ్ళాలంటే కష్టం."

"అదేం!" అన్నది ఆశ్చర్యంగా కాంతిశ్రీ

"అదంతేనండి. నీళ్ళు ఎక్కువగా వుంటాయి. అందుకని ఎడ్లబళ్ళు వెళ్ళలేవ్" అన్నాడు చింతాలయ్య.


ఏవేవో మాట్లాడుకుంటూ నడవసాగారు

నాలుగు ఫర్లాంగులు వచ్చేసరికి యిళ్ళు కనిపిస్తుంటే వుండబట్టలేక—


"ఆ కనిపించేదేనా మీ వూరు!" అని అడిగింది కాంతిశ్రీ.

"కాదండి. ఆ కనిపించేది మా వూరు పంచాయితీ 'కప్పాపురం'. ఆ వూరులోంచి మరో మైలు వెడితే మా గూడెం వస్తుంది" అన్నాడు సారథి.

చుట్టూవున్న పంట పొలాలను చూసుకుంటూ కాంతిశ్రీ హుషారుగా నడుస్తోంది. చల్లని గాలి హాయిగా వీస్తోంది. ఏవేవో పక్షులు అరుచుకుంటూ వెడుతున్నాయి.



# వంతెన



నందం రామారావు

"మీకు తెలుసో, లేదో, మా వూరికి కరెంటు లేదు. రేపు నాటకం ఆడినా పెట్రొమాక్స్ లైట్లతోనే ఆడాలి" అన్నాడు సారథి శాంతిశ్రీవైపు చూసి.

"అలాగా" అందామె.

అప్పటికి బాగా చీకటిపడిపోయింది.

కీచురాళ్ళు అరుస్తున్నాయి.

కప్పలు అరుస్తున్నాయి.

ఏదో పేరు తెలియని పిట్ట మహా వికృతంగా అరుచుకుంటూ ఎటో పోతోంది.

కరెంటు దీపాలు లేకపోవడంవల్ల ఆ ప్రాంతాన్నంతా ఎవరో రాక్షసుడు పాలిస్తున్న ద్వీపంలా వుంది

అర్ధరాత్రి ఒంటరిగా అడివిలో ఆడపిల్లని వొదిలేసినట్టుగా కూడా వుంది.

అప్పటివరకూ ఎంతో సరదాగా వున్న శాంతిశ్రీకి ఏదో భయం లాటిది కలిగింది.

బిక్కుబిక్కుమంటూ నడవసాగింది.

కప్పాపురం దాటి వూళ్ళో డొంక వెంట నడవసాగారు.

దారంతా నానా కచాడీగా వుంది.

తెలియని ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చామా అని శాంతిశ్రీ బాధపడసాగింది

వంతెన దగ్గర కొచ్చారు.

శాంతిశ్రీ తలెత్తి చూసింది.

మసక వెన్నెల కురుస్తోంది.

కాలవలో నీరు వుధృతంగా ప్రవహిస్తోంది.

ఎగువనుంచి పల్లంలోకి నీరు ప్రవహించడంవల్ల ఒక మహా ప్రళయం వంత విస్తున్నట్టుగా వుంది నీటి శబ్దం.

దాదాపు పది గజాల వెడల్పుంది. ఒక రాక్షసుడు చాచిన నాలుకలా వుంది కాలవ.

ఆ కాలవను చూడ్డంతోనే శాంతిశ్రీ వొణికిపోయింది. నోటమాట రాక అలాగే నిలబడిపోయింది.

"రండి వంతెన దాటితే మా గూడెం వచ్చినట్లే" అంటూ సారథి గట్టు ఎక్కాడు

ఆ గట్టు ఎత్తుగా వుంది.

శాంతిశ్రీ నెమ్మదిగా గట్టెక్కింది.

పెద్ద పెద్ద దుంగలు పాతి దాని మీద నడవడానికి తాటిపట్టీలు వేసివున్నాయి. క్రింద అరుగజాల లోతున నీరు మహా వేగంగా ప్రవహిస్తోంది. చలిగాలి వూచి వూచి కొడుతోంది.

"వంతెనంటే యిదా" అంది శాంతిశ్రీ ఆశ్చర్యంగా.

"అవునండి దీన్నే మా భాషలో వంతెనంటాం. ప్రెసిడెంటుగారికి ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోవడం లేదు"

"అమ్మ బాబోయ్ ఈ వంతెన మీద నేను చస్తే నడవను. ఏవండీ ఎందుకొచ్చిన నాటకాలు గానీ నా దారిన నన్ను పోనివ్వండి చూశారా, నీరు ఎంత లోతుగా వుందో!"

"మీకేం భయం లేదండి. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేస్తాను. మీరు నెమ్మదిగా నడవండి చాలు."

శాంతిశ్రీ ఆ తాటి పట్టీలమీద ప్రాణాలు బిగబెట్టి నెమ్మదిగా నడవసాగింది

కాళ్ళు వొణుకుతున్నాయి. గుండె దడదడలాడుతోంది. తన చావు యిక్కడే రాసిపెట్టి వున్నట్టుగా భయపడసాగింది. నడవలేక పోతోంది. బాలెన్సు తప్పిపోతున్నట్టుగా అనిపించి—

"సారథిగారూ" అన్నది.

ముందు నడుస్తున్న సారథి శాంతిశ్రీ పిలుపుకి ఆగి "ఏవిటండీ?" అన్నాడు.

"నేను వెనక్కి తిరిగి వెళ్ళిపోతాను, మీరు మరోలా భావించకండి. నాకెందుకో

భయంగా వుంది. నేనిక నడవలేను."

వెంటనే సారధి ఆమె చేతిని పుచ్చుకుని "మీకేం భయంలేదు నేనున్నాను. నా చేతిని పుచ్చుకుని నెమ్మదిగా నడవండి. అయినా మీరిప్పుడిలా అంటే ఎలా?"

శాంతిశ్రీ గభాల్న సారథి చేతిని పుచ్చుకుని క్రిందికి చూసింది.

క్రింద కాలవలో నీరు ఏదో వింత శబ్దం చేస్తూ గలగలా పారుతోంది

"ఇంతకుముందు ఈ కాలవలో పడి ఎవరైనా చనిపోయారా?" అప్రయత్నంగా అడిగింది శాంతిశ్రీ.

"ఆఁ ఇప్పటికి యిద్దరు చనిపోయారు. ఈ తాటి పట్టీలమీద నడుస్తూ వొళ్ళు తూలో, కళ్ళు తిరిగో పడిపోయినవారు చాలామంది వున్నారు. సాధారణంగా పల్లెటూళ్ళో వారికి ఈత వచ్చు గనుక ఎలాగో బయటపడుతూ వుంటారు."

"సారథిగారూ! మీరింతమంది యువకులుండి సిమెంటుతో వంతెన కట్టించలేకపోయారంటే ఆశ్చర్యంగా వుంది"

"నిజమేనండి. మేమింతమంది వుండి కూడా ఏం చెయ్యలేకపోయామంటే మాకే సిగ్గుగా వుంది. మా ప్రయత్నాలు అన్ని రకాలుగానూ చేశాం. కానీ, ఈవూరి ప్రెసిడెంటు పార్వతీశం మా ప్రయత్నాల్ని అన్ని విధాలా నాశనం చేశాడు. ఇప్పుడవన్నీ ఎందుకులేండి! ఇదిగో వంతెన దిగుతున్నాం — జాగ్రత్త."

ఎలాగైతేనేం అందరూ వంతెన దిగారు.

వీరి కోసమే ఎదురు చూస్తున్న మిగతా వారు వచ్చి సారధిని కలుసుకున్నారు

అందరూ నాటకం రిహార్సల్సులో పడిపోయారు.

* * *

అర్ధరాత్రి టైమెంతయిందో తెలియదు గానీ అంతా నిశ్శబ్దంగా వుంది!

బయట నులకమంచం మీద పడుకున్న సారధి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

కళ్ళు తెరచి ఆకాశం కేసి చూస్తుండిపోయాడు. ఆకాశంలో నక్షత్రాలు మనం సాధించిన ప్రగతికి చిహ్నంలా మెరుస్తున్నాయి!

ఒక నక్షత్రం మాత్రం సారథి కంటికి మరీ ప్రత్యేకంగా కనిపించసాగింది. ఆ నక్షత్రంలో తనూహించుకుంటున్న ఎన్నో ప్రగతి పథకాలు కొట్టొచ్చినట్టుగా కన్పిస్తున్నాయి

ఎక్కడనుంచో నల్లని మబ్బు తునకొకటి వొచ్చి ఆ నక్షత్రాన్ని కప్పేసింది. ఆ మబ్బుతునక వున్నట్టుండి ప్రెసిడెంటు పార్వతీశంగామారి వికృతంగా నవ్వుతున్నట్టుగా అనిపించింది.

సారధి కళ్ళు మూసుకున్నాడు. అతని కళ్ళముందు గతంలో జరిగిన సంఘటనొకటి కదలాడసాగింది!

గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్న పార్వతీశం యెవరో వచ్చినట్టనిపించి తలెత్తి చూశాడు.

ఆయన కెదురుగా సారధి నిలబడి వున్నాడు

"నమస్కారమండి. నా పేరు...."

"తెలుసు. గూడెంలో వుంటున్నావ్. ఏవిటిలా వచ్చావ్?"

"కాలవకు వంతెన లేకపోవడంవల్ల గూడెంలో వున్న వాళ్ళమంతా చాలా యిబ్బందులు పడుతున్నాం. దయచేసి మీరు వంతెన నిర్మించే ప్రయత్నం చెయ్యండి. మా వంతు సహాయం అందరం కలిసి చేస్తాం."

"చూడు సారథీ! నీ ఆశయం మంచిదే. ఈ గ్రామానికి పెద్దగా నాకూ చాలా గొప్ప పనులు చెయ్యాలనివుంటుంది. ఆచరణలో సాధ్యంకాదు. ఐనా, ఇప్పుడు మీకేం ఇబ్బంది వచ్చిందని? ఎంచక్కా దుంగలు పాతించి, తాటిపట్టీలు వేయించాను. మీరు నడవడానికి ఆ మాత్రం చాలు"

."అన్నీ తెలిసినవారు మీరే అలా అంటే ఎలా చెప్పండి? దాని మీద నడవడం ఎంతకష్టమో ఒకసారి మీరు వచ్చి చూస్తే మీకే తెలుస్తుంది. నిన్నగాక మొన్న రావులమ్మ తాటిపట్టీల మీద నుంచి నడుస్తూ నీటిలో పడిపోయి ప్రాణం విడిచింది. అంతక్రితం పదేళ్ళ దాసు నడుస్తూనే పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మా కష్టాలను గమనించి మీరు ఆదుకోవాలి" దాదాపు ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు సారధి.

"ఇదిగో సారధీ! మీ గూడెంలో నువ్వేదో చదువుకున్నవాడినని. పెద్దగా వెలిగిపోదామని చూస్తున్నావేమో. ఈ వూరి బాగోగులు నాకు పూర్తిగా తెలుసు. యింకేం మాట్లాడకుండా ఇక నువ్వెళ్ళు."

"పార్వతీశంగారూ! మా కష్టాలను గమనించమని మీక్కాకపోతే ఇంకెవరికి చెప్పుకోగలం!"

"ఎవరికీ చెప్పుకోనవసరం లేదు. ముందిక్కడ్నించి వెళ్ళు" పార్వతీశం కోపంగా లేవబోయాడు.

"పార్వతీశంగారూ! మాట్లాడ్డం మీ ఒక్కరికే చేతనవుననుకుంటున్నారేమో. మాకూ వచ్చు. ఆ వంతెన కట్టించడానికని మీరు ప్రభుత్వంనుంచి ఇరవై వేల రూపాయలు తీసుకున్నారు. వంతెన కట్టించినట్టుగా పుస్తకాల్లో కూడా చూపించారు."

ఈ మాట వినడంతోనే పార్వతీశం యింతెత్తులేచి "ఇంకేం. అన్నీ తెలుసుకునే వచ్చావన్నమాట ఇదిగో సారధీ! పెద్దవాళ్ళం అనేకం అనేక రకాలుగా చేస్తాం. మీకు మాట్లాడే హక్కు, ప్రశ్నించే అధికారం లేదు. మర్యాదగా యిక్కడ్నుంచి వెళ్ళు. అంతేగానీ, నా ప్రతిచర్యకూ అడ్డొచ్చావా?....నా సంగతి నీకు తెలుసు. అనవసరంగా ప్రవాహంలో కొట్టుకుపోతావ్. జాగ్రత్త. వెళ్ళు. వెళ్ళి నీ పనులేవిటో చూసుకో" అన్నాడు.

ఆ తర్వాతసారధి ఎన్నిరకాలుగా, ఎంత ప్రయత్నించినా వంతెన కట్టించడం



కుదరలేదు!

డబ్బు మదంతో కొట్టుకుంటున్న పార్వతీశానికి ఎలా బుద్ధిచెప్పాలో తెలియడం లేదు.

గాంధీజీ కలలుగన్న జీవితం పల్లెటూళ్ళో వుందని అందరూ అనుకుంటారు!

కానీ. ఇక్కడేం జరుగుతోందో ఎంతమందికి తెలుసు?

హింసతో అన్నిపనులూ సాధించలేం. ఒక వేళ సాధించినా— ఎన్ని హింసలని చేసుకుంటూ పోతాం?

మానసిక పరివర్తనతోనే ఏదైనా సాధించగలగాలి.

ఆ మానసిక పరివర్తనే మనిషికి శాశ్వతమైన కనువిప్పు

అదే పార్వతీశానికి జరగాలి!

ఎలా... ఎలా?

పడుకున్న సారధి పక్కమీద అటూ, యిటూ కదిలాడు.

ఆకాశంలో తారలు చూడముచ్చటగా గుసగుస లాడుకుంటున్నాయి. చిరు చలిగాలి వేడి పుట్టిస్తోంది.

సడిలేని ఆ రాత్రిలో ఏదో అస్పష్టమైన భావం సారధి మనస్సులో కదుల్తోంది.

ఆ భావానికి రూపం యిస్తే ఎలా వుంటుంది' సారధి ఆలోచనలతో ఆ రాత్రంతా అలాగే గడిపాడు!

* * *

దసరా వుత్సవాలు ప్రారంభమయినాయి. ఆరోజే గూడెంలో సాంఘిక నాటకం ప్రదర్శన. చిన్నా. పెద్దా అందరూ మహా వుత్సాహంగా వున్నారు. పెట్రొమాక్స్‌లైట్లూ, స్టేజీ అలంకరణ.

హీరోయిన్ మేకప్. వాయిద్యాల సంగీతం....

నాటకం ఇంకా మొదలు పెట్టకముందే మహాసందడిగా వుంది!

ఒక్కొక్కరే నాటకం చూడ్డానికొస్తున్నారు.

కప్పాపురం నుంచి కూడా జనం ఎక్కువగానే వస్తున్నారు.

అప్పటికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది. ఏదో పనిమీద వెళ్ళి గూడానికొస్తున్నాడు సారథి

"సారథన్నయ్యా" అన్న కేక వినిపించడంతో సారథి ఆగాడు.

ఆ మసక వెన్నెల్లో పిలిచింది ఎవరైందీ తెలియక— "ఎవరూ?" అన్నాడు.

"నేనన్నయ్యా- కృష్ణుడ్ని"

"నువ్వా కృష్ణుడూ ఏవిటి,"

"నాటకం చూడ్డానికి వొస్తున్నానన్నయ్యా. అవునూ! ఆ నాటకంలో నువ్వు వెయ్యడంలేదా?"

"వేస్తున్నానుగానీ ఒక్కడివే వస్తున్నావేమిటి?"

"పాలేరు రంగడు వెనకాలవస్తున్నాడు. నిన్నుచూసి గబగబా వచ్చేశాను."

"అలాగా. ఐతే పోదాం పద...."

అంటూ సారథి ముందుకు నడిచాడు

కృష్ణుడు సారథిచేతిని పుచ్చుకుని నడవసాగాడు.

కృష్ణుడికి సన్నెండేళ్ళుంటాయి.

హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు.

ఎర్రగా, బొద్దుగా. చలాకీగా వుంటాడు.

సారధంటే వాడికెందుకో మహా ఇష్టం.

కృష్ణుడు పార్వతీశానికి ఒక్కగానొక్క కొడుకు

వంతెన దగ్గర కొచ్చినతర్వాత అక్కడింకా నలుగురైదుగురు మనుషులున్నారు

వాళ్ళంతా నాటకాన్ని గురించే మాట్లాడుకుంటున్నారు. రెండు మూడు రోజులుగా కురిసిన వర్షానికి కాలవ నిండుగా వుంది. ప్రవాహ వేగం వుధృతంగా వుంది.

తాటిపట్టీల మీద అందరూ జాగ్రత్తగా నడుస్తున్నారు. ముందు ఎవరో నడుస్తున్నారు. ఆ తర్వాత కృష్ణుడు నడుస్తున్నాడు కృష్ణుడు వెనకాల సారథి నడుస్తున్నాడు. సారధి వెనకాల ఇంకెవరో నడుస్తున్నారు.

అందరూ యేవేవో మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ నడుస్తున్నారు.

ఆకాశం నిర్మలంగా వుంది.

గాలి స్తంభించి వుంది.

నీటి ప్రవాహపు శబ్దం మాత్రం ఆ రాత్రి సమయంలో శృతి తప్పిన వాయిద్యంలా వినిపిస్తోంది.

ఉన్నట్టుండి నడుస్తున్న కృష్ణుడు పట్టు తప్పి పెద్ద ఆర్తనాదం చేస్తూ నీటిలో పడిపోయాడు.

"రక్షించండి రక్షించండి" అంటూ కృష్ణుడు ఆ నిశీథిలో బిగ్గరగా, భయంగా కేకలు వేయసాగాడు.

ఏం జరిగిందో ఏవిటో అని అక్కడున్న వారందరూ తెలుసుకునే లోపల సారథి ఒక్క వూపుతో కాలవలోకి దూకేశాడు కృష్ణుడ్ని రక్షించడానికి.

ఇంతలో ఈ విషయం తెలిసి పెట్రొమాక్స్ లైట్లతో ఆందోళనగా కాలవ దగ్గరకు చేరారు జనం

తన కొడుకు కాలవలో పడిపోయాడనీ, సారథి, కృష్ణుడ్ని రక్షించడానికి కాలవలోకి దూకాడనీ తెలిసిన పార్వతీశం మతిపోయినవాడిలా పరిగెత్తుకుంటూ కాలవ దగ్గర కొచ్చాడు.

అప్పటికే అంతా అయిపోయింది.

ఎంత వెదికినా కృష్ణుడు కనిపించలేదు.

నీటి ప్రవాహం కృష్ణుడ్ని ఎక్కడికో లాక్కెళ్ళిపోయింది.

* * *


ఇది జరిగి దాదాపు రెండునెలలు దాటింది.

కప్పాపురంలో అనుకోని మార్పులు జరిగాయి.

ఊళ్ళోనుంచి బస్సువరకూ కంకర రోడ్డు పడింది.

కరెంటు స్తంభాలు పాతారు. మరో పది రోజుల్లో ఆ వూరికి కరెంటు రావచ్చును.

కాలవకు పక్కా వంతెన నిర్మించారు. ఇప్పుడా వంతెనమీద ఎడ్ల బండ్లు కూడా వెళ్ళవచ్చును అయితే ఇంకా ఆ వంతెనకు ప్రారంభోత్సవం జరగలేదు.



ఊళ్ళో జరిగిన ఈ మార్పుకి అంతా సంతోషిస్తున్నా సారథి మాత్రం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లిప్తంగా వుంటున్నాడు.

ఎప్పుడూ సంతోషంగా వుంటూ ఎదటి వారి సుఖాన్ని కోరే సారధి యిలా ఎందుకుంటున్నాడో అర్థంకాక తలోవిధంగా అనుకో సాగారు.

అలా అనుకోవడంలో శాంతిశ్రీ ప్రసక్తికూడా వచ్చింది. ఐతే, ఇక్కడ శాంతిశ్రీ ప్రసక్తి అనవసరం. ఈ కథలో ఆమెపాత్ర ముఖ్యం కాదుగనుక.

* * *

ఆ రోజే వంతెనకు ప్రారంభోత్సవం. ఊళ్ళో పచ్చని తోరణాలు కట్టి, రంగు రంగుల కాయితాలు అంటించి, ఒక గొప్ప పండుగలా వైభవంగా చేస్తున్నారు.

పేరు ప్రఖ్యాతులు గల ఒక పెద్దమనిషి ఆ సాయంత్రం వంతెనకు ప్రారంభోత్సవం చేస్తారు.

అందరూ ఎవరి పనుల్లో వారుండగా, సారథి తన ఇంటి దగ్గర నుంచి బయలుదేరి సరాసరి పార్వతీశంగారింటికి వెళ్ళాడు.

ఆ సమయంలో ఆయన ఆ సాయంత్రం జరగబోయే కార్యక్రమాన్ని గురించి చర్చిస్తున్నారు. సారథిని చూట్టంతోనే మనస్ఫూర్తిగా లోపలికి ఆహ్వానించారు.

ఒక్కగానొక్క కొడుకు చనిపోయాడన్న దుఃఖం పార్వతీశంగారిని కృంగదీస్తున్నా, కొడుకు చనిపోవటంతో ఆయనలో ఎవరూ వూహించని పరివర్తన కలిగింది!

దాని ఫలితమే ఊరు బాగుపడడం!

చనిపోయిన తన కృష్ణుడికోసం సారథి ఎలాపరితపించిందీ పార్వతీశానికి తెలుసు.

"పార్వతీశంగారూ! మీతో మాట్లాడాలి. నాకు అవకాశం యిస్తారా!" అన్నాడు సారథి.

సారథి మాటకు పార్వతీశం ఆశ్చర్యపోయి, అతన్ని మరోగదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టారు.

కొన్ని క్షణాలు యిద్దరిమధ్యా నిశ్శబ్దం తర్వాత సారధి అన్నాడు—

"మీరు నన్ను క్షమించినా, క్షమించకపోయినా నేనో పెద్ద నేరం చేశాను మీరు నాకు ఏ శిక్ష విధించినా ఆనందంగా అనుభవిస్తాను."

"సారథీ! ఏమిటి నువ్వు మాట్లాడేదీ!" పార్వతీశం తలెత్తి చూశాడు.

సారథి కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ముఖమంతా పీక్కుపోయి కొన్ని నెలలు లంఖణాలు చేసిన మనిషిలా వున్నాడు.

"కృష్ణుడ్ని నేనే చంపాను"

ఎవరూ వూహించని సత్యం.

ఈ సత్యాన్ని నిర్భయంగా చెబుతున్నాడు సారథి.

ఈ మాట వినటంతోనే పార్వతీశానికి అమితమైన కోపం వచ్చింది. ఆ క్షణంలో సారథిని చంపాలన్నంత కోపం వచ్చింది.

"పార్వతీశంగారూ! కృష్ణుడ్ని నేను చంపాలని చంపలేదు. కాటి పట్టీలమీద నడుస్తున్న కృష్ణుడిని తోపేస్తే నీటిలోపడతాడు. నీటిలో పడగానే నేను వెళ్ళి కృష్ణుడ్ని రక్షించి ఒడ్డుకి తీసుకొస్తాను. స్వయంగా మీ కొడుకే ఆ వంతెన మీద నుంచి నీటిలో పడితే మీకు ఎంత బాధ కలుగుతుందో తెలియజెయ్యడం కోసమే నేనా పనిచేశాను. ఆ రకంగా, చిన్న నాటకం వల్ల మాకు పక్కా వంతెన వస్తుందని ఆశించాను. కానీ నీటి ప్రవాహపు వేగానికి కృష్ణుడు కొట్టుకుపోయాడు. ఎంత వెదికినా, ఎంత గాలించినా, కృష్ణుడ్ని రక్షించలేకపోయాను." సారధి చెంపల మీదుగా కన్నీళ్ళు జారుతున్నాయి.

పార్వతీశం కొన్ని క్షణాలు సారధి ముఖంలోకి చూశాడు. చూసి, ఆ తర్వాత యిలా అన్నాడు—

"సారథీ! నా అహంకారాన్ని అణచడానికి నువ్వు చేసిన ప్రయత్నం మంచిదే కానీ, దురదృష్టం వెంటాడింది. ఇది నువ్వు చెయ్యాలని చేసిన నేరం కాదు. ఇందులో నిన్ను శిక్షించడానికేం లేదు. ఇప్పుడు నేనేమిటో తెలుసుకున్నాను."

అంటూ సారథి చేతిని ఆప్యాయంగా పట్టుకుని బయటకు నడిచాడు పార్వతీశం.

ఆయన్ని అనుసరించి నడుస్తుంటే సారథి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి! ●

